


**చిన్నమాట**

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# కథ పేరు: లిఫ్ట్
## { మౌరీన్ వాల్ష్ కథకి స్వేచ్ఛానువాదం}
### (కథాకాలం 1993)

**అది అమెరికాలోని రూట్ 100**. ఆ హైవేకి అటు, ఇటు కంచెల అవతల ఆవులు మేస్తున్నాయి. ఆ సాయంత్రం మూడుంముప్పావుకి జెఫ్ ఆ హైవేకి కుడివైపు అంచులో తూర్పువైపు నడిచి వెళ్తున్నాడు. అతను ఆ ఆవుల వంక కాని, చుట్టుపక్కల మొక్కలకి ఉన్న రకరకాల పువ్వులవైపు కాని, దూరంగా కనపడే ఆకుపచ్చ కొండవంక కాని చూడడంలేదు.

జెఫ్ మైలు దూరంలో ఉన్న కారు శబ్దాన్ని పసిగట్టగలుగుతున్నాడు. అది తనని సమీపించక మునుపే ఎడమచేతిని ఎత్తి బొటనవేలుని, తనకి లిఫ్ట్ ఇవ్వమన్నట్లుగా వేడుకోలుగా చూపిస్తున్నాడు. అతని పక్కనించి కార్లు ఆగకుండా వేగంగా వెళ్ళిపోతున్నాయి.

జెఫ్ వాళ్ళని మనసులోనే తిట్టుకున్నాడు. ఆ వేడి రోడ్డుమీదనించి చల్లటి కారులోకి ఎప్పుడు చేరతానా అని అతనికి ఉంది. అప్పటికే రెండు గంటలనించి అతను ఆ రోడ్డుమీద నడుస్తున్నాడు.

జెఫ్ తనకి ఎవరైనా లిఫ్ట్ ఇస్తారనే ఆశతో ఏమ్ హెర్స్ట్ నించి కాలినడకన బయలుదేరాడు. అరవై మైళ్ళ దూరంలోని తన అన్నయ్య దగ్గరికి వెళ్తున్నాడు. అతని తల్లి ఇచ్చిన డబ్బులో పన్నెండు డాలర్లని ఆదా చేయడానికి గ్రే హౌండ్ బస్‌ని ఎక్కలేదు. అదికూడా అన్నతో కలిసి గడిపే వీకెండ్ రోజుల్లో దేనికైనా  ఖర్చుకి ఉపయోగిస్తుందని ఆశపడ్డాడు. ఏమ్ హెర్స్ట్ నించి అతని అన్న చదివే యూనివర్సిటీకి లిఫ్ట్ దొరక్కపోయినా నాలుగు గంటల్లో చీకటి పడకుండా చేరుకోవచ్చనే ధైర్యంతో నడకని ఆరంభించాడు.

అదే రోడ్డుమీద పశ్చిమం నించి రూట్ 100లో ఓ నల్లటి కారు తూర్పువైపుకి వస్తోంది. దాన్ని నడిపేది డారెల్. అతను పావుగంట క్రితం ఓ రెస్టారెంట్‌లోంచి బయటికి వచ్చి బిల్లు చెల్లించి కారెక్కబోయేముందు  కారు వెనక సీట్లోని ఖర్చులని రాసే కాగితంలో ఆ రెస్టారెంట్ పేరు, బిల్ నంబర్, అయిన ఖర్చు రాసుకున్నాడు. అతను ఆవులకి వాడే విటమిన్స్, యాంటీ బయోటిక్స్‌ని తయారుచేసే కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్. వెర్మాంట్‌లో ఆవుల ఫారాలు అధికం కాబట్టి ఒకో ఫారాన్ని సందర్శించి వాటి యజమానులనించి ఆర్డర్లని తీసుకుంటున్నాడు. డారెల్ దయా స్వభావం కలవాడు. అవసరంలోని ఎందరికో లిఫ్ట్ ఇచ్చినవాడు.

పడమర నించి రూట్ 100లో తూర్పు వైపుకి వెళ్ళే కార్లలో మరొకటి నల్లకారు. అది లెస్‌ది. అతని పక్క సీట్లో డెల్, వెనక సీట్లో టాం కూర్చుని ఉన్నారు. అందరి చేతులకీ తెల్లటి గ్లవ్స్ ఉన్నాయి. హాలోవీన్ రాత్రినించి లెస్ నెలకోసారి రూట్

100లో కారులో తన ముగ్గురు మిత్రులతో కలిసి ప్రయాణం చేస్తున్నాడు. వారిది భౌగోళిక గమ్యంలేని ప్రయాణం. వారి గమ్యం వేరే ఉంది.

గత నాలుగు నెలలుగా అతను లిఫ్ట్ కోరేవారిని తన కారులో ఎక్కించుకుంటున్నాడు. రూట్ 100లో నడిచి వెళ్తు లిఫ్ట్ కోరేవారు అధికం. అంతదాకా వారు అలాంటివారినించి టిటానియం రిస్ట్ వాచీని ,కాంపాక్ట్ కెమెరాని, నాలుగు సెల్‌ఫోన్లని, సరికొత్త లేప్‌టాప్‌ని దొంగిలించారు. యూనివర్సిటీ విద్యార్థుల దగ్గర నగదు పెద్దగా ఉండదు. అలాంటివాడిని ఎక్కించుకున్నాక వాడి బట్టలు పూర్తిగా విప్పి, సహాయం అందడానికి మైళ్ళ దూరంలో విడిచిపెడతారు. వారి కారు దొంగిలించి, నంబర్ ప్లేట్ మార్చబడింది కాబట్టి అంతదాకా పట్టుబడలేదు. ఎప్పుడైనా ఆడది దొరికితే బలాత్కరించాలనే వారి కోరిక ఇంకా తీరలేదు. పోలీసులు చిన్న నేరస్థులని పట్టించుకోవడంలేదు. బలాత్కారం జరిగితేకాని వారు ఈ నేరస్థుల కోసం ప్రయత్నించరు.

జెఫ్ మొదటి పావుగంటలోనే తనకి లిఫ్ట్ దొరుకుతుందని ఆశపడ్డాడు. కాని అరగంట, ముప్పావు గంట గడిచి గంట దాటాక మొదటిసారిగా తనకి గమ్యందాకా లిఫ్ట్ దొరకదేమోనని భయపడసాగాడు. రెండు గంటలు గడిచాక ఇక ఆశ వదులుకున్నాడు. జంక్షన్ 103కి చేరుకున్నాక ఓపిక లేకపోతే అక్కడ బస్ ఎక్కదలచుకున్నాడు. ఆ విధంగా కనీసం ఆరుడాలర్లు ఆదా చేసినట్లవుతుంది. జంక్షన్ 103లో గ్రేహౌండ్ బస్ స్టాప్ ఉందని, గంట గంటకీ బస్‌లు ఉన్నాయని జెఫ్‌కి తెలుసు.

అదే రూట్ 100లో పశ్చిమ నించి తూర్పుకి వెళ్ళే మరో కారు రంగు కూడా నలుపే. దాన్ని నడిపేది జానెట్. తనభర్తతో పోట్లాడి ఆమె కోపంగా కారెక్కి తన తల్లి దగ్గరికి బయలుదేరింది. తల్లి జెఫ్ అన్నయ్య చదివే యూనివర్సిటీలోనే లైబ్రేరియన్‌గా పనిచేస్తోంది. తన భర్తనించి జానెట్ రెండు నేర్చుకుంది. చక్కగా డ్రైవ్ చేయడం, కొత్త వ్యక్తిని అక్రమ సంబంధంలోకి లాగడం. త్వరగా. ఆమెకి తనకంటే చిన్న వయసు యువకులంటే ఇష్టం. ముప్పై రెండేళ్ళ జానెట్‌కి వారి వయసు పధ్నాలుగుకి ఎంత దగ్గరగా ఉంటే అంత ఆనందం. ప్రస్తుతం ఆమె మానసిక్ అస్థితి అలాంటి ప్రేమికుడ్ని కోరుకుంటోంది. 'యూనివర్సిటీలో మాత్రం ఎలాంటి పిచ్చి పనులు చేసి నా పరువు తీయకే' అని తల్లి అలా భర్తతో పోట్లాడి వెళ్ళినప్పుడల్లా జానెట్‌ని హెచ్చరిస్తూంటుంది.

పదిహేనేళ్ళ జెఫ్ ఆగి తన భుజాలమీది బేక్‌పేక్‌లోంచి నీళ్ళ సీసాని తీసుకున్నాడు. అందులోని ఆఖరి నీటిని మూడు గుక్కలు తాగి దాన్ని మళ్ళీ యథాస్థానంలో ఉంచాడు. ఇంకో అరగంటలో తను జంక్షన్ 103కి చేరుకోగలనని మైలు రాయిని చూసి అనుకున్నాడు.

అక్కడనించి తన అన్న మైక్‌కి ఫోన్ చేస్తే తను బస్‌లో యూనివర్సిటీకి చేరేలోగా బస్ స్టాండ్‌కి కారుని తెచ్చి సిద్ధంగా ఉంటాడు. సూర్యుడు అస్థమిస్తూండడంతో వెలుతురు మసక బారుతోంది.

రూట్ 100లో తూర్పువైపు ప్రయాణించే ఇంకో కారు కూడా నల్లదే దాన్ని నడిపేది జెన్నీ. ఆమె వయసు అరవైరెండు. తన కొడుకు డ్రగ్స్ ఓవర్ డోస్‌తో మరణించినప్పటినించి ఆవిడ ఓ పనిని చేపట్టింది. రూట్ 100లో ప్రతీ శుక్రవారం సాయంత్రం కారుని పోనిస్తూ నడిచి వెళ్ళే తన కొడుకు వయసు గలవారిని కారులో ఎక్కించుకుని, వారు ఎందుకు వాహనంలో వెళ్ళడంలేదో విచారించి, డ్రగ్స్ వినియోగం ఎంత భయంకరమో ఉపన్యాసం ఇచ్చి, వారికి కొంత నగదు ఇచ్చి సమీపంలోని గ్రే హౌండ్ బస్ స్టాండ్‌లో దింపుతుంది. గత ఆరేళ్ళల్లో ఆవిడ అలా అరవై నాలుగుమందిని బస్ ఎక్కించింది. ఆవిడ భర్త మార్షల్ ఆవిడ కారుని ఇంకో కారులో అనుసరిస్తూంటాడు. ఆవిడ ఎక్కించుకున్న లిఫ్ట్ కోరేవారిలో ఎవరైనా దుర్మార్గులు, నేరస్థులు ఉంటే వారినించి ఆవిడని రక్షించడానికి ఆయన కారు డేష్ బోర్డులో ఓ పాయింట్ 32 కేలిబర్ రివాల్వర్ కూడా సదా ఉంటుంది.

జెఫ్ ఆగి విశ్రాంతి తీసుకుంటూ వెనక్కి తిరిగి చూశాడు. పశ్చిమం నించి వచ్చే ఓ కారు దూరంనించి కనపడింది .ఆ కారు తనని ఎక్కించుకుందా సరి. లేదా రోడ్ దాటి ఎదురుగా ఉన్న బస్‌స్టాండ్‌లోకి వెళ్ళాలని నిర్ణయించుకుని లిఫ్ట్ ఇమ్మన్నట్లుగా చేతిని ఎత్తి బొటన వేలిని చూపించాడు.

జెఫ్ పక్కనించి వెళ్ళిన ఆ నల్లటి కారు నెమ్మదిగా ఆగింది. డ్రైవర్ సీట్లోని వ్యక్తి వెనక్కి తిరిగి చేసిన సైగని చూసి జెఫ్ ఆనందంగా నవ్వుతూ కారు తలుపు తెరుచుకుని లోపల కూర్చున్నాడు. కారు ముందుకి కదిలింది.

జెఫ్ విధిని ఆ కారులోని వారు నిర్ణయిస్తారు.

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments